## క్లుప్తంగా

### వ్యాయామశాలకు నిధులివ్వండి



బోధన్: పట్టణ కేంద్రంలోని హనుమాన్ వ్యాయామశాల నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని బుధవారం ఎంపీ ధర్మపురి అరవింద్‌ను ఆర్మూర్‌లోని ఆయన స్వగృహంలో బీజేపీ నాయకులు కలిశారు. ఈ మేరకు వినతి పత్రం అందించారు. ఎంపీ సానుకూలంగా స్పందించారని బీజేపీ నాయకుడు అడ్లూరి శ్రీనివాస్ తెలిపారు.

### కంటి శిబిరాలు ప్రారంభం

పెర్కిట్(ఆర్మూర్): మండలం కోమన్‌పల్లిలో బుధవారం కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ నీరడి రాజేశ్వర్ ప్రారంభించారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలను అందజేశారు.

**యాద్గార్‌పూర్‌లో..**

రుద్రూర్: కోటగిరి మండలం యాద్గార్‌పూర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని బుధవారం స్థానిక సర్పంచ్ మిర్జాపురం విజయ సాయన్న ప్రారంభించారు. ఉప సర్పంచ్ ఆంజనేయులు, హెల్త్, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

**జానకంపేటలో..**

ఎడపల్లి(బోధన్): జానకంపేట జీపీ ఆవరణంలో బుధవారం కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ సాయిలు యాదవ్ ప్రారంభించారు. 150 మందికి కంటిపరీక్షలు నిర్వహించారు. ఎడపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రాజ్‌కుమార్, ఎంపీటీసీ మంద సంజీవ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి ప్రేమ్ దాస్, తదితరులు పాల్గొన్నారు.

### కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం పిప్రిలో బుధవారం లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. సర్పంచ్ ఆసపురం దేవి శ్రీనివాస్ రెడ్డి, సొసైటీ చైర్మన్ సోమ హేమంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై నలుగురు లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఎంపీటీసీ సామెర సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

### కమ్యూనిస్టు ప్రణాళికా గ్రంథం పార్టీలకు కరదీపిక



బోధన్: కమ్యూనిస్టు సిద్ధాంత కర్తలు కారల్ మార్క్స్, ఎంగిల్స్ రచించిన కమ్యూనిస్టు ప్రణాళిక గ్రంథం విప్లవ కమ్యూనిస్టు పార్టీలకు కరదీపికని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా సబ్ డివిజన్ కార్యదర్శి మల్లేష్ అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలో ఆయన మాట్లాడారు. కమ్యూనిస్టు ప్రణాళిక వెలువడి 175 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఇటీవల కోల్‌కత్తాలో జాతీయ స్థాయి సెమినార్ జరిగిందన్నారు.

### కొనసాగుతున్న జిల్లా దీక్షలు



బోధన్: బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక కోర్టు ఎదుట న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 143వ రోజుకు చేరాయి. దీక్షలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఎం.గంగారెడ్డి, న్యాయవాది అర్జున్‌రాండర్‌లు కూర్చున్నారు. బీఆర్ఎస్ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రతినిధి ఎంఏ రజాక్ మద్దతు తెలిపారు.

### తొలగిస్తామనడం సరైన నిర్ణయం కాదు

ఆర్మూర్: తమ న్యాయమైన డిమాండ్ల కోసం 13 రోజులుగా సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను విధుల నుంచి తొలగిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) తరఫున ఖండిస్తున్నామని జిల్లా అధ్యక్షుడు బాలయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజన్న బుధవారం పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉద్యోగులపై బెదిరింపుల ధోరణిని వీడి వారి సమస్య పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

### ఎన్ఎస్ఎఫ్ ఇనుప సామగ్రి అమ్మకాలు నిలిపివేయాలి

బోధన్: నిజాంషుగర్ ఫ్యాక్టరీ కోర్‌కమిటీ ఆధీనంలో ఉన్న ఇనుప స్తంభాలు, ఇతర సామాగ్రిని గోప్యంగా వేలం పాటల ద్వారా విక్రయించే చర్యలను నిలిపివేయాలని ఎన్‌డీఎస్ఎల్ మజ్దూర్ సభ యూనియన్ ప్రతినిధి రవి శంకర్ గౌడ్ బుధవారం అన్నారు. స్థానిక కోర్ కమిటీ అధికారులు కార్మికులకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని తెలిపారు. రెండు నెలల క్రితమే ప్రకటన ఇచ్చామని కోర్ కమిటీ అధికారులు చెప్పుకొస్తున్నారని పేర్కొన్నారు. విలువైన ఇనుప సామగ్రిని అమ్మకానికి పెట్టాలని ఆదేశాలుంటే బహిరంగ ప్రకటన చేయాలి కానీ కోర్ కమిటీ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

# పదిలో సత్తా చాటిన విద్యార్థులు

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లా విద్యార్థులు మంచి ప్రతిభ చాటారు. ఈ ఏడాది ప్రైవేటు పాఠశాల విద్యార్థులతో పోటీపడి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 10 జీపీఏ సాధించి ఔరా అనిపించారు. బుధవారం రాష్ట్ర విద్యా శాఖా మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఫలితాలను విడుదల చేశారు. ఫలితాలపై ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. – సాక్షి నెట్‌వర్క్

### బోధన్ పరిధిలో..

**10 జీపీఏ సాధించిన బోధన్ విద్యార్థులు**



ప్రణవి, హున్స, ఎంపీహెచ్ఎస్ | షేక్ ఈజార్, ఆదర్శ పాఠశాల, రెంజల్, | సింధుప్రియ, ప్రజ్ఞశ్రీ స్కూల్, సాలూర | కె. శ్రీదేవి రెడ్డి, విజయసాయి హైస్కూల్ | దేశ్‌పాండే శర్వరీ, మాతృశ్రీ హైస్కూల్ | పాటిల్ పూర్ణిమ, వంశీ హైస్కూల్ | చందన, లయోల హైస్కూల్

పదో తరగతి ఫలితాల్లో బోధన్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు 72.40 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో నాగనాథ్ తెలిపారు. హున్స ఎంపీహెచ్ఎస్‌లో విద్యార్థిని ఎస్.ప్రణవి 10 జీపీఏతో సత్తా చాటింది. రెంజల్ మండలంలో 90.84 ఉత్తీర్ణత సాధించారు. రెంజల్ ఆదర్శ పాఠశాలకు చెందిన షేక్ ఈజార్, మైనార్టీ గురుకుల పాఠశాలకు చెందిన నర్మీన్‌లు 10 జీపీఏ సాధించి మండల టాపర్లుగా నిలిచారు. బోధన్ పట్టణ కేంద్రంలోని ఏడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన 253 మంది పరీక్షలకు హాజరుకాగా 182 మంది విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. బోధన్ పరిధిలో ప్రైవేట్ పాఠశాలల ఉత్తీర్ణత 93 శాతంగా నమోదైంది. రుద్రూర్ మండలంలో 82 శాతం, నవీపేటలో 91 శాతం ఉత్తీర్ణత సాధించగా.. నవీపేట బాలికల గురుకుల పాఠశాలకు చెందిన రుచిత 10 జీపీఏ సాధించింది. సాలూర మండల కేంద్రంలోని ప్రజ్ఞ శ్రీ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. ఈ పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు.

కోటగిరి ఉమ్మడి మండలంలో 85 శాతం, మోస్రా మండలంలో 57 శాతం, ఎడపల్లి గురుకుల బాలికల పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. బోధన్ పట్టణంలోని విజయసాయి పాఠశాలకు చెందిన 14 మంది, మాతృశ్రీ పాఠశాలకు చెందిన ముగ్గురు, వంశీ హైస్కూల్‌కు చెందిన ముగ్గురు, లయోల పాఠశాలకు చెందిన ఇద్దరు 10 జీపీఏ సాధించారు.

### ఆర్మూర్ పరిధిలో..



చౌహాన్ శ్రీనిధి, టీఎస్ మోడల్ స్కూల్, పెర్కిట్ | సహస్ర, టీఎస్ మోడల్ స్కూల్, పెర్కిట్ | గాదె కావ్యశ్రీ, టీఎస్ మోడల్ స్కూల్, పెర్కిట్ | చేపూర్ భవ్య, టీఎస్ మోడల్ స్కూల్, పెర్కిట్ | ఎస్ఆర్ భవానీ, జెడ్పీహెచ్ఎస్, తొండాకూర్

ఆర్మూర్ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 15 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారు. పెర్కిట్ తెలంగాణ మోడల్ స్కూల్‌కు చెందిన చౌహాన్ శ్రీనిధి, సహస్ర, గాదే కావ్యశ్రీ, చేపూర్ భవ్య, మామిడిపల్లిలోని బ్రిలియంట్ గ్లామర్ స్కూల్‌కు చెందిన సాయి కృష్ణ, శివ కౌశిక్, సంజన, నవ్యశ్రీ, కృష్ణవేణి హైస్కూల్‌కు చెందిన అశ్లేష, విజయ్ హైస్కూల్‌కు చెందిన మణికంఠ, శ్రీ చైతన్య స్కూల్‌కు చెందిన హేమంత్, సంశిత, రక్షిత్, నరేంద్ర స్కూల్‌కు చెందిన నవదుర్గ, స్ఫూర్తి 10 జీపీఏ సాధించారు. మండలంలోని 9 పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మాక్లూర్ పరిధిలో 98.13 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాధికారి రాజ్‌గంగారెడ్డి తెలిపారు. డొంకేశ్వర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. మారపంల్లి, నికాల్‌పూర్, డొంకేశ్వర్, గాదెపల్లి, నూత్‌పల్లి జెడ్పీహెచ్ఎస్‌లోనూరు శాతం ఉత్తీర్ణత వచ్చింది.

### బాల్కొండ పరిధిలో..

బాల్కొండ: బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలో పదవ తరగతిలో మిశ్రమ ఫలితాలు వచ్చాయి. బాల్కొండ మండలంలో కిసాన్‌నగర్, వన్నెల్(బి), మైనార్టీ, కేజీబీవీ, ముప్కాల్ మండలంలో రెంజర్ల, కేజీబీవీ, మెండోరా మండలంలో తెలంగాణ రాష్ట్ర బాలుర గురుకుల, బాలికల గురుకుల పాఠశాలలో 100 శాతం విద్యార్థులు ఉతీర్ణత సాధించారు. ఉమ్మడి బాల్కొండ మండల పరిధిలోని 14 పాఠశాలల్లో నూరు శాతం ఉతీర్ణత నమోదైంది. ఐదుగురు విద్యార్థులు 10 జీపీఏ సాధించారు. కమ్మర్‌పల్లి పరిధిలో 94 శాతం, వేల్పూర్ పరిధిలో 97.85 శాతం ఉత్తీర్ణ సాధించారు.

## ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ తదితరులు

రుద్రూర్: చందూర్ మండల కేంద్రంలోని మర్రి బౌడ, గొల్లపేట్ ప్రాంతాల్లో నిరుపేదలకు గతంలో పంపిణీ చేసిన ఇళ్ల స్థలాలు చూయించాలని జెడ్పీటీసీ రమావత్ అంబర్‌సింగ్, వైస్ ఎంపీపీ దశాగౌడ్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం లబ్ధిదారులతో కలిసి తహసీల్దార్ వసంతకు వినతిపత్రాన్ని అందజేశారు. రెవెన్యూ అధికారులు 13 ఏళ్ల క్రితం ఈ ప్రాంతాల్లో సుమారు వంద మందికి ఇళ్ల స్థలాల పట్టాలు అందజేశారు. సరిహద్దులు చూపకపోవడంతో లబ్ధిదారులు రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వసంత మాట్లాడుతూ.. వారం రోజుల్లో ప్లాట్లకు నంబర్లు వేసి రోడ్లు మార్కింగ్ చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఉన్నారు.

## 'వారి సేవలను గుర్తించడం లేదు'



నవీపేట: మారుమూల గ్రామాలలో విధులు నిర్వహిస్తున్న వీవోఏ, వీఆర్ఏల సేవలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించడం లేదని బీజేపీ బోధన్ నియోజకవర్గ నాయకులు వడ్డి మోహన్‌రెడ్డి అన్నారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సమ్మె చేస్తున్న ఐకేపీ వీవోఏ, వీఆర్ఏలకు ఆయన బుధవారం సంఘీభావం తెలిపారు. అనంతరం మాట్లాడారు. చిరుద్యోగుల సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఎంపీటీసీ మైసరాధ, నాయకులు నాగేశ్వర్‌రావ్, గంగోని రాము, కాంతంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వేంకటేశ్వర స్వామి కల్యాణం

బోధన్‌టౌన్(బోధన్) : పట్టణంలోని వేంకటేశ్వర కాలనీలోగల వెంకటేశ్వర స్వామి ఆలయ దశమ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ద్వార పాలకుడైన ఆంజనేయ స్వామి శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఘనంగా జరిపించారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ముందుకు సాగని కొనుగోళ్లు

- అయోమయంలో రైతులు
- లారీల కొరత ఇంకెన్ని రోజులంటూ ఆగ్రహం



కల్లాల్లో నిల్వ ఉన్న వరి ధాన్యం రాసులు

మాక్లూర్: వర్షాకాలం ముంచుకొస్తున్న ఇంకా కోయాల్సిన వరి పంటలు కోయకపోవటం, లారీల కొరతతో కొనుగోళ్లు ముందుకు సాగక, చేతికి వచ్చిన వరి ధాన్యం కల్లాలల్లో ఎక్కడిక్కడే కుప్పలు తెప్పలుగా పేరుకుపోయి ఉండటంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. నారు మడులు సిద్ధం చేసుకునే సమయం ఆసన్నమైనప్పటికీ వరి ధాన్యం అమ్ముడుపోక దాన్ని కాపోడుకోవటంతోనే రోజులు గడుస్తున్నాయని రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. మాక్లూర్ ప్రాథమిక వ్యవసాయ పరిపతి సంఘం పరిధిలో 14 కొనుగోలు కేంద్రాలు సొసైటీ నిర్వహిస్తుండగా, గంగరమంద, వేణుకిసాన్‌నగర్ తండాలో ఐసీడీఎస్, వెంకటాపూర్‌లో ఐకేపీలు కొనుగోలు చేస్తున్నాయి. అమ్రాద్ సొసైటీ 4 కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తోంది. ఒక్కో గ్రామంలో భారీ ఎత్తున హమాలీలను సమకూర్చి 3 నుంచి 5 వరకు కాంటాలు జరిపిస్తున్నా.. కాంటా అయిన ధాన్యం సంచులను తీసుకెళ్లే లారీలు 4 రోజులకు ఒకసారి రావటంతో వరి ధాన్యం సంచులు ఎక్కడికక్కడే పేరుకుపోతున్నాయి. వర్షం కురిస్తే తడిసి ముద్దవుతున్నాయి. వాటిని మళ్లీ ఆరబెట్టి రెండోసారి కాంటా చేయాల్సి వస్తోంది. ఇలా రైతు సమయమంతా కల్లాలపైనే గడిచిపోతోంది. మిగిలి ఉన్న పంటలను కోసి నిల్వ చేయాలన్నా.. వరి ధాన్యం రైసుమిల్లులకు చేరాలన్నా మరో నెల సమయం పడుతుంది. చేతికి డబ్బులు అందాలంటే ఇంకెంత సమయం పడుతుందోనంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సారి పెట్టుబడులకు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తుందంటూ రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

### డబ్బులు తొందరగా ఇప్పించాలి

ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి వెళ్లిన వెంటనే రైతుల ఖాతాలో డబ్బులు పడేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. వరి నారుమడులను సిద్ధం చేసుకునే సమయం అయింది. ఇప్పుడు మా దగ్గర డబ్బులు లేవు. ధాన్యం విక్రయించగా వచ్చిన డబ్బులతోనే వర్షాకాలం పంటకు సిద్ధం కావాల్సి ఉంటుంది. – ప్రమోద్, రైతు, బొంకన్‌పల్లి, మాక్లూర్

### రెండు రోజులైతే కొరత ఉండదు

రెండు రోజులైతే లారీల కొరత ఉండదు. ఇటీవల కుర్సిన వర్షాల వల్ల ప్రస్తుతం లారీల కొరత తీవ్రంగా ఉంది. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని అదనంగా హమాలీలను తెచ్చి ఒక్కో గ్రామంలో 3 నుంచి 5 కాంటాలు నడిపిస్తున్నాము. లారీల కొరత వల్లే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిలిచిపోయింది. – గంగారాం, అమ్రాద్ సొసైటీ కార్యదర్శి

## కొనసాగుతున్న వీవోఏల ఆందోళన



మోస్రాలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న వీవోఏలు



మాక్లూర్‌లో..

రుద్రూర్: మోస్రా మండల కేంద్రంలో బుధవారం వీవోఏలు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. తమ న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

**మాక్లూర్‌లో..**

మాక్లూర్: డిమాండ్ల సాధనకై మండల కేంద్రంలో వీవోఏలు చేస్తున్న సమ్మె బుధవారం నాటికి 17వ రోజుకు చేరుకుంది. డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

**రెంజల్‌లో..**

రెంజల్(బోధన్): రెంజల్‌లో బుధవారం నాటికి వీవోఏల సమ్మె 14వ రోజుకు చేరుకుంది. రెంజల్ ఎంపీడీవో కార్యాలయం ముందు నిరవధిక సమ్మె చేస్తున్నారు. ఆందోళన కార్యక్రమంలో మండల ప్రతినిధులు గంగాధర్, భాగ్య, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## నెలాఖరు నుంచి గొర్రెలను పంపిణీ చేస్తాం



మాక్లూర్: జిల్లాలో ఈ నెలాఖరు నుంచి రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమం ప్రారంభమవుతుందని మండల పశు వైద్యాధికారి కిరణ్ దేశ్‌పాండే వెల్లడించారు. బుధవారం కొత్తపల్లిలో జరిగిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ సబ్సిడీ పోను కుర్మ, గొల్ల కులస్తులు వారి వాటా కింద రూ.43 వేల 750లు నెఫ్ట్ ద్వారా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వేముల పల్లి సుబ్బారావు, గొర్రె, మేకల పెంపకందారుల సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## 15 నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

భీమ్‌గల్: ఈ నెల 15 నుంచి 17 వరకు బాబాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల మైదానంలో చీఫ్ మినిస్టర్ కప్ 2023 మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాజేశ్వర్ తెలిపారు. 15 నుంచి 36 సంవత్సరాల లోపు యువతీ యువకులు ఆధార్ కార్డు ద్వారా ఆయా గ్రామ పంచాయతీల్లో నమోదు చేసుకోవాలని చెప్పారు.

# జీపీ సిబ్బంది డిమాండ్లు నెరవేర్చాలి



సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న మల్లికార్జున్‌రెడ్డి



నందిపేట ఎంపీడీవో నాగవర్ధన్‌కు సమ్మె విరమణ పత్రాన్ని అందజేస్తున్న కారోబార్లు, కార్మికులు

వేల్పూర్: ఐకేపీ వీవోఏలు, జీపీ సిబ్బంది న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం తీర్చాలని బీజేపీ నేత ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో వీవోఏలు, జీపీ సిబ్బంది చేస్తున్న సమ్మెలో బుధవారం ఆయన పాల్గొని మాట్లాడారు. అరకొర జీతాలతో కుటుంబాలను పోషించుకోలేని పరిస్థితుల్లో వారున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే వారి వేతనాలు పెంచాలన్నారు.

**సమ్మె విరమణ**

నందిపేట్/మాక్లూర్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కారోబార్లు, కార్మికులు చేపట్టిన సమ్మెను విరమిస్తున్నట్లు బుధవారం నందిపేట ఎంపీడీవో నాగవర్ధన్, మాక్లూర్ ఎంపీవో శ్రీనివాస్‌కు విరమణ పత్రాన్ని అందజేశారు. జిల్లా కమిటీ నిర్ణయం మేరకు తాము సమ్మె విరమించి నేటి నుంచి విధుల్లో చేరుతామని వారు తెలిపారు.

## ఆర్మూర్‌లో అవినీతి రాజ్యమేలుతోంది



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఆర్మూర్‌టౌన్: నియోజకవర్గంతో పాటు ఆర్మూర్ పట్టణంలో అవినీతిలో రాజ్యమేలుతుందే తప్ప ఎటువంటి అభివృద్ధి జరగలేదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు నూతుల శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. ఆర్మూర్ పట్టణంలో బీజేపీ నాయకులు బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..100 పడకల ఆస్పత్రిలో రెగ్యులర్ స్టాఫ్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇండోర్ స్టేడియం రూ.లక్షలు వెచ్చించి నిర్మించినా ఇప్పటికీ ప్రారంభం కాకముందే శిథిలావస్థకు చేరుకుందన్నారు. ఆర్మూర్, మామిడిపల్లి, పెర్కిట్‌కు విడుదలైన నిధులను మళ్లీ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి చెప్పడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి ఉంటే అభివృద్ధిపై చర్చకు రావాలని సవాల్ విసిరారు.

## '10 కిలోల కడ్తా తీస్తామని బెదిరిస్తున్నారు'



ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నేత మల్లికార్జున్‌రెడ్డి

వేల్పూర్: అక్లూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బాల్కొండ బీజేపీ నాయకులు డాక్టర్ ఏలేటి మల్లికార్జున్ రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామ కొనుగోలు కేంద్రంలో తడిసిన వడ్లను కొనుగోలు చేయడంలేదని ఆరోపించారు. తేమ పేరుతో క్వింటాల్‌కి రూ.10 కిలోల వడ్లను కడ్తా తీస్తామని రైస్ మిల్లర్లు బెదిరిస్తున్నారని అన్నారు. లేదంటే తిరిగి పంపిస్తామని రైతులను భయందోళనలకు గురిచేస్తున్నారని అన్నారు. అక్లూర్ గ్రామంలో వరి కోసి 40 రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు సరిగ్గా కొనుగోలు చేయడం లేదని చెప్పారు. సమయానికి కొనుగోలు చేసి ఉంటే ధాన్యం వర్షానికి తడిసేది కాదని మండిపడ్డారు. జిల్లా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రైతులు ఇన్ని ఇబ్బందులు పడుతుంటే ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. ఆత్మీయ సమ్మేళనాలు అంటే ముందుంటారు కానీ రైతుల సమస్యలంటే వెనుకడుగు ఎందుకు వేస్తున్నారని ప్రశ్నించారు. మంత్రి తక్షణమే స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. లేకుంటే ధర్నాకి దిగుతామని హెచ్చరించారు.

## సఫాయి కార్మికులు సిపాయిలై పోరాడాలి





సమావేశమైన కార్మికులు

ఆర్మూర్‌టౌన్ : సఫాయి కార్మికులు సిపాయిలై పోరాడి తమ వేతన క్రమబద్ధీకరణ సాధించాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దాసు పిలుపునిచ్చారు. ఆర్మూర్ పట్టణంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయం వద్ద కార్మికులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. జీవో-60 ప్రకారం కార్మికులకు రూ.15 వేల వేతనం వెంటనే అమలు చేయాలని కోరారు. మే 25 వరకు జిల్లా సదస్సులు, మే 26న గ్రామసర్పంచ్, కార్యదర్శులకు వినతి పత్రాలను అందజేయాలని, మే 29న ఎంపీడీవో ఆఫీసుల వద్ద ధర్నా చేసి వినతి పత్రాలు ఇవ్వాలని, జూన్ 5న సమ్మె నోటీసు ఇవ్వాలని, జూన్ 12న కలెక్టరేట్‌ల వద్ద ధర్నాలు నిర్వహించాలన్నారు.

## 'వడ్లు కొంటానన్న ఎమ్మెల్యే కనపడటం లేదు'



ఎడపల్లి మండల కేంద్రంలో వెలసిన ఫ్లెక్సీలు

బోధన్: ఎడపల్లి మండల కేంద్రంలో మళ్లీ ఫ్లెక్సీల వివాదం తెరపైకి వచ్చింది. బీఆర్ఎస్, బీజేపీల మధ్య ఫ్లెక్సీల వివాదం తెరపైకి వచ్చింది. బుధవారం మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో ఎమ్మెల్యే షకీల్ కనబడటం లేదని ఫ్లెక్సీలు బీజేపీ పేరిట వెలిశాయి. ఈ ఫ్లెక్సీలో తడిసిన ధాన్యం కొంటామన్న ఎమ్మెల్యే షకీల్ కనబడటం లేదని, ఇప్పటి వరకు గింజ కూడా కొనలేదని రాసి ఉంది. ఈ విషయం తెలుసుకొని బీఆర్ఎస్ నాయకులు ఫ్లెక్సీలను తొలగించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీరామ్ మాట్లాడుతూ.. ఆపదకాలంలో నేను ఉన్నానని ఎమ్మెల్యే, రైతులకు భరోసా కల్పించారని పేర్కొన్నారు. బీజేపీ నేతలు ఫ్లెక్సీలు కట్టడం సరికాదని తెలిపారు.

### ఎడపల్లిలో వడగండ్ల బీభత్సం



రాలిన గింజలు



రాణాకలాన్‌లో వడగండ్లకు నేలకొరిగిన వరి

ఎడపల్లి(బోధన్): మండలంలోని రాణాకలాన్, జానకంపేట్ గ్రామాలలో వడగండ్లతో కూడిన వర్షం కురిసింది. ఈ కారణంగా కోత దశలో ఉన్న వరి ధాన్యపు గింజపు రాలిపోయారు. సుమారు 90 ఎకరాల్లో నష్టం జరిగింది. ఈ అకాల వర్షాలు రైతన్నలకు తీవ్ర నష్టం కలిగించాయి.